కర్నూలు | నంద్యాల వార్త

26 నవంబర్ , 2024 మంగళవారం పేజీలు 4

కష్టపడిన వారిని సీఎం చంద్రబాబు గుర్తిస్తారు.. : రాష్ట్ర మంత్రి టి.జి భరత్..

: కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి భరత్

కర్నూలు,నవంబర్25, ప్రభాతవార్త; పార్టీలో కష్టపడిన వారికి సీఎం చంద్రబాబు నాయుడు తగిన గుర్తింపు ఇస్తారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. నగరంలోని ఎం.ఆర్.సి కన్వెన్షన్ హాలులో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి టి.జి భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలన అందరికీ తెలుసన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెట్టే పరిస్థితులు ఉండేవన్నారు. అలాంటి సమయంలో కూడా ప్రజల తరుపున ధైర్యంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారని మంత్రి అన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోమిశెట్టి ఎన్నో కార్యక్రమాలు చేశారన్నారు. పార్టీ కోసం కష్టపడిన విధానాన్ని గుర్తించి చంద్రబాబు నాయుడు కుడా ఛైర్మన్‌గా సోమిశెట్టిని ఎంపిక చేశారని మంత్రి టి.జి భరత్ అన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో.. పిచ్చిమొక్కలు

- అందులోనే చిన్నారుల ఆటలు

ఆలూరు రూరల్, నవంబర్25, ప్రభాతవార్త: ఆలూరు పట్టణంలో కోటవీధి సెంటర్-4లో పూర్తిగా విద్యార్థులకు భద్రత కరువైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉదయమైతే పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లో వదిలేసి మేం పొలం పనులకు వెలుతున్నామని కాని అక్కడ ఉన్నటువంటి చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు చూస్తుంటే భయమేస్తుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చాలా మంది పిల్లలకు అక్కడే ఉన్నటువంటి ఆ పిచ్చి మొక్కల్లో ఆటలాడుకోవడంతోపాటు అందులోనే మూత్రవిసర్జన చేస్తుండడంతో అక్కడ ఉన్నటువంటి పిచ్చిమొక్కలు పిల్లలకు తగిలి దురదలు, పుండ్లు లాంటివి వ్యాపిస్తున్నాయని గతంలో సంబంధిత టీచర్లకు ఈ విషయాన్ని చెప్పామని వారు కూడా స్పందించి సొంత డబ్బు ఖర్చుచేసి అక్కడక్క పిచ్చి మొక్కలు పికేయించినా మళ్లీ మొలుస్తున్నాయని అంగన్‌వాడీ టీచర్ జయశ్రీ తెలిపారు. అయితే దీని పక్కనే జారుడు బండ, ఉయ్యాల, పిల్లల ఆట సామాగ్రి మొత్తం ఆ పిచ్చిమొక్కల మధ్యనే ఉండడంతో గతంలో పిల్లలకు చిన్న చిన్న విషపురుగులు కారిచాయని తల్లిదండ్రులు తెలుపుతున్నారు. వాటిని చూసి పిల్లలను ఆ అంగన్‌వాడీ సెంటర్‌కు పంపాలన్నా భయమేస్తుందని స్కూల్‌కు పంపడం కంటే మా వెంట పొలానికి తీసుకువెళ్లడం మంచిదని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇదే విషయం పై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మాను వివరణ కోరగా పలుమార్లు పంచాయతీ అధికారులకు ఇదే విషయం పై ఫిర్యాదు చేయడం జరిగిందని గతంలో ఉన్నటువంటి ఈవోఆర్డీ ప్రకాష్ నాయుడుకు ఆ పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించాలని కోరామని ఆమె తెలిపారు.

లక్షల.. లెక్కెక్కడ..!?

- అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట...
- సంపద సృష్టిస్తామంటున్న సీఎం
- ఉన్న సంపదను దుర్వినియోగం చేస్తున్న పంచాయతీ అధికారులు
- షాపింగ్ కాంప్లెక్స్ వేలంపాట వేయరా...

సంపద సృష్టించే సత్తా మనకు ఉంది. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలు నడిపిద్దాం అంటూ రాష్ట్ర ప్రజలకు ఒక భరోసా కల్పించే ప్రయత్నం చేస్తూ, ఆ రహదారివైపు అడుగులు వేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనవంతు ప్రయత్నం చేస్తుండగా మరోవైపు ఇంటి పన్నులు, బాడుగల రూపంలో వసూలవుతున్న సంపదను రాష్ట్ర ఖజానాలో జమ చేయకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కొందరు అధికారులు పనితీరును ఏమనాలి. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న అదికారులను ఎవరిని నిలదీయాలి... ప్రజల నుంచి పన్నుల రూపంలో బాడుగల రూపంలో వసూలు చేసిన లక్షలాది రూపాయలు ఏమయ్యాయి...? లక్షల లెక్కెక్కడ, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. వారంతా సమావేశల్లో చెబుతున్న మాటలు ఉత్తుత్తి గాండ్రింపులేనా..!

మిడుతూరు, నవంబర్25, ప్రభాతవార్త; మండలకేంద్రమైన మిడుతూరు గ్రామ పంచాయతీ ద్వారా ఇంటి పన్నులు, షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన బాడుగల డబ్బు ట్రెజరీలో జమ కాలేదని తెలుస్తుంది. గ్రామ పంచాయతీ ద్వారా ఇంటి పన్నులు వసూలయ్యాయి. మండలకేంద్రం మిడుతూరు గ్రామ పంచాయతీకి చెందిన 14 షాపులు ఉన్నాయి. కొన్ని నెలల్లోగా సంబంధిత షాపులు బాడుగలు వసూలు అవుతున్నాయి. వసూలు చేసిన ఇంటి పన్నులు, షాపింగ్ కాంప్లెక్స్ బాడుగలు దాదాపు రూ.3.59 లక్షలు సంబంధిత అధికారి ట్రెజరీలో జమ చేయలేదని సమాచారం. ఈ విషయం సంబంధిత పై అధికారులకు తెలుసు. ఆ అధికారికి నోటీసులు ఇచ్చి మమ అనిపించారు తప్పా అధికారులు ఇతరత్రా చర్యలు కానీ ప్రయత్నించలేదని

తెలిసింది. దీంతో ఈ విషయంలో అదికారులు కూడా చేతివాటం ప్రదర్శించారా? లేకపోతే కళ్లెదుట ఇంత జరుగుతున్నా పట్టించుకోక పోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండలకేంద్రంలోని మిడుతూరులో 14 గ్రామ పంచాయతీల షాపులు ఉన్నాయి. వాటికి సంబంధించిన డబ్బులు వసూలు అయినా ఆ డబ్బును ట్రెజరీలో జమ చేయడంలేదని తెలిసింది. కాగా ప్రతి ఏడాది షాపులకు వేలంపాట నిర్వహించాలి, అలా చేయకుండా ప్రస్తుత బాడుగకు పర్సంటేజీ రూపంలో బాడుగను పెంచారు. అయితే ఈ యేడాది మొదటికే మోసం వచ్చింది. ఎన్నికల సందర్భంగా మార్చిలో నిర్వహించాల్సిన షాపుల వేలం పాటలు ఇంతవరకు నిర్వహించలేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి అధికారులు పరోక్షంగా గండి కొట్టినట్లే కదా... ఇప్పటికీ వేలంపాట విషయంలో సంబంధిత అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వారిలో చలనం లేదు. డబ్బులు వసూలు మాత్రం అవుతున్నాయి. కానీ...

• వివరాలు 2లో

పర్యాటక రంగం రాష్ట్ర అభివృద్ధికి తోడ్పతుంది

- మంత్రి బిసి జనార్దనరెడ్డి

నంద్యాల, నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి పర్యాటక రంగం రాష్ట్రాబివృద్ధికి దోహద పడుతుందని రోడ్డుభవనాలు, పెట్టుబడులు, మౌళికవసతుల శాఖ మంత్రి బిసి జనార్దనరెడ్డి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ప్రణిళిక అందించారు సోమవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో డిప్యూటి సియం పవన్‌కళ్యాణ్‌కు దేవదాయశాఖ మంత్రి అనం నారాయణరెడ్డితో కలిసి మంత్రి బిసి జనార్దనరెడ్డి పుష్పగుచ్చం అందించారు.ఈ సందర్భంగా టెంపుల్ ఎకో అడ్వెంచర్ హెరిటేజ్ టూరిజం అబివృద్ధికి కార్యాచరణపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ అద్యక్షతన సమావేషం నిర్వహించారు ఇందులో బిసి పాల్గొన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అబివృద్ధికి ప్రత్యేక ప్రణాళికపై చర్చించారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం భారత రాజ్యాంగం..!

- జాతీయ సమైక్యతకు మార్గదర్శికం రాజ్యాంగం
- రాజ్యాంగ రచనలో డా.అంబేద్కర్ కృషి అజరామరం..
- నేడు 75వ భారత రాజ్యాంగ దినోత్సవం..

కోసిగి, నవంబరు 25, ప్రభాతవార్త

"మన రాజ్యాంగం మనల్ని విఫలం చేయలేదు. ప్రజాస్వామ్యాన్ని అధికార క్రీడా స్థాయికి దిగజార్చి మనమే రాజ్యాంగాన్ని విఫలం చేసాం..మన ప్రజాస్వామ్యం మనందరి కోసం.. ముఖ్యంగా పేద, బలహీన, అణగారిన ప్రజానీకం కోసం పనిచేసేలా పరిస్థితుల్ని మనం పునర్మించుకోవాలి. దీన్ని సాధించాలంటే ముందు మనం మేలుకోవాలి. చేసిన తప్పుల్ని గుర్తించాలి. అంబేద్కర్ కలల్ని, స్వతంత్ర పోరాట యోధుల దార్శనికతను సాకారం చేయాలంటే ఇప్పటి నుంచైనా దిద్దుబాటు చర్యల్ని మొదలు పెట్టాలి" భారత స్వాతంత్ర్య పోరాట ఆశయాలు, ఆదర్శాలు, విలువలు భారత ప్రజాస్వామ్యానికి పునాదులు.. భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని, పరిపాలన విధానాన్ని, ప్రజల యొక్క స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం యొక్క ఆదర్శాలను, లౌకిక, సామ్యవాద సార్వజనీన సిద్ధాంతాలకు శాసనంగా రూపొంది చబడినదే "భారత రాజ్యాంగం"..

రాజ్యాంగ రచనకు వ్యూహాత్మకం: స్వాతంత్ర్యానికి పూర్వమే భారతీయులకు రాజ్యాంగాన్ని రచించటానికి 299 మంది సభ్యులతో 1946లోనే 'రాజ్యాంగ సభ' ఏర్పాటయింది. భారత రాజ్యాంగ రచనకు ఎన్నికైన రాజ్యాంగ పరిషత్ వివిధ అంశాల పరిశీలనకు 22 కమిటీలను, 7 ఉప కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో అత్యంత ముఖ్యమైన ముసాయిదా (డ్రాఫ్టింగ్) కమిటిని 1947 అగస్టు 29న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అధ్యక్షుడిగా, ఆరుగురు సభ్యులతో ఏర్పాటు చేసారు..భిన్న భౌగోళిక పరిస్థితులు, జాతులు, మతాలతో వైవిధ్యంగా ఉన్న దేశానికి చక్కటి దిశానిర్దేశం చేయడానికి ఏలాంటి రాజ్యాంగం కావాలనే విషయంపై డాక్టర్ అంబేద్కర్‌కు స్పష్టత ఉందని స్వయంగా మహాత్మ గాంధీజీ నమ్మేవారు. ఈ కారణంగానే రాజ్యాంగ పరిషత్‌లో కాంగ్రెస్‌దే ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికి సభ్యులంతా అప్పటికే న్యాయశాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ బిఆర్. అంబేద్కర్ పేరును ముక్తకంఠంతో సూచించారు.. దీంతో డాక్టర్ అంబేద్కర్ 'ముసాయిదా సంఘం'అధ్యక్షుడిగా 7 మంది సభ్యులతో రాజ్యాంగ రచనను చేపట్టారు..అంతేకాక రాజ్యాంగ పరిషత్ 11సార్లు సమావేశమైంది. కమిటీల సభ్యులంతా లిఖిత, మౌఖిక రూపంలో ఇచ్చిన సూచనలను ముసాయిదా కమిటీ నమోదు చేసుకునేది. వాటిని క్రోడీకరించిన తర్వాత రాజ్యాంగ పరిషత్‌లో చర్చకు పెట్టేవారు. రాజ్యాంగ పరిషత్ ఏ అంశాన్నీ ఓటింగ్ ద్వారా ఆమోదించలేదు. ప్రతీ ప్రతిపాదనన, సమస్యపై సుధీర్ఘంగా చర్చించి, సర్ధుబాటు చేసి, సమన్వయం, ఏకాభిప్రాయం ద్వారా పరిష్కరించిన తర్వాతే ఆమోదించేవారు. ఈ ప్రక్రియ ముసాయిదా కమిటి పనిని భారీగా పెంచింది. ముసాయిదా ప్రతి తయారీలో భాగంగా అంబేద్కర్ స్వయంగా 60 దేశాలకు చెందిన రాజ్యాంగాలను చదివారు. దీంతో రాజ్యాంగ సభలో జరిగిన అనేక చర్చలు, సవరణల అనంతరం సుమారు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు కష్టించి, సుదీర్ఘ మేధోమధనం తరువాత ముసాయిదా కమిటీ తయారు చేసింది. దీని వెనుక అంబేద్కర్ అవిరళ కృషి ఉంది. దీనిపై రాజ్యాంగ పరిషత్‌లో 115 రోజులు చర్చించి2473 సవరణలతో రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26వ తేదిన భారత రాజ్యాంగ సభ 'రాజ్యాంగాన్ని' ఆమోదించింది. దీంతో అప్పటి నుండి ప్రతి సంవత్సరం నవంబరు 26వ తేదినే రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవటం ఆనవాయితీగా మారింది..అయితే దీనిని 1950వ సంవత్సరం జనవరి 26వ తేదిన రాజ్యాంగాన్ని దేశ వ్యాప్తంగా అమల్లోకి వచింది..

అడిగేవారు.. లేరనుకున్నారా..

: పద్ధతి మార్చుకోకపోతే పెన్ను పెట్టాల్సి వస్తుంది..

: విఆర్‌ఓల పనితీరు పట్ల అగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

నందికొట్కూరుటౌన్, నవంబర్ 25, ప్రభాతవార్త : ఉన్నతస్థాయి అధికారులు ఎంత బాగా పనిచేసినా క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలు వారి దృష్టికి తేకుండా కింది స్థాయి ఉద్యోగులు నిర్లక్ష్యంతో పనులు చేయకపోవడంతో అందరికీ చెడ్డపేరు వస్తుందని, మండలంలో విఆర్‌ఓల పనితీరు చాలా అధ్వాన్నంగా ఉందని, అడిగేవారు లేరనుకున్నారా, పద్ధతి మార్చుకోకపోతే తాను పెన్నుకు పని పెట్టాల్సి వస్తుందని నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తీవ్ర స్థాయిలో విఆర్‌ఓలు, గ్రామ కార్యదర్శులను హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ అవరణలో తహశీల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిత్తా జయసూర్య మట్లాడుతూ నందికొట్కూరు మండలంలో పనిచేసే విఆర్‌ఓల పనితీరు చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. ప్రతి గ్రామానికి విఆర్‌ఓలు ప్రతిరోజు వెళ్తున్నారా, వెళితే అక్కడి ప్రజలు ఏయే సమస్యలు తమ దృష్టికి తెస్తున్నారు, వచ్చిన సమస్యలు తహశీల్దార్ దృష్టికి ఎందుకు తేవడం లేదన్నారు. ఏ ఒక్క విఆర్‌ఓ కూడా సమయానికి గ్రామాలకు వెళ్లడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎంత ప్రయత్నించినా విఆర్‌ఓల పనితీరుతో అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోతున్నామన్నారు. విఆర్‌ఓలకు ఎందుకింత నిర్లక్ష్యం అని ఎక్కడ చూసినా వారి గురించే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పొలాలకు విలువ పెరగడంతో గ్రామాల్లో రెవెన్యూ పరమైన సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాల్సిన విఆర్‌ఓలు ఎందుకు కాలయాపన చేస్తూ ప్రజలకు విసుగు వచ్చేలా చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. తహశీల్దార్, ఎంపిడిఓలు బాగా పని చేసినా కింది స్థాయి సిబ్బంది పనితీరు బాగోకుంటే వారు ఏమి చేస్తారని ప్రశ్నించారు. మల్యాల గ్రామానికి సంబంధించిన సమస్య పరిష్కరించమని తాను రెఫర్ చేస్తే గానీ అ గ్రామ విఆర్‌ఓ స్పందించలేదన్నారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులందరితో తనకు ఇది వరకే పరిచయం ఉన్నందున వారికి స్థానభ్రంశం కల్పించలేదని, మంచితనాన్ని అసరాగా చేసుకుని ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తే తాను చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నందికొట్కూరు సర్వేయర్ అయితే ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇకపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలకు వచ్చే సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సంబంధిత అధికారులపై వేటు తప్పదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో స్పందించని వారిపై దృష్టి సారించాలని అధికారులను అదేశించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రభుత్వ అధికారులు కూడా ప్రభుత్వంలో భాగమేననే విషయాన్ని గుర్తించుకుని పనితీరు మెరుగు పరుచుకోవాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా పని చేయాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చే వినతులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బిజినవేముల సర్పంచ్ రవియాదవ్, ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం శర్మ, రెవెన్యూ, మండలాభివృద్ధి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్జీలు వెంటనే.. పరిష్కరించండి

: పబ్లిక్ గ్రీవెన్స్ పై డా.బి.నవ్య

కర్నూలు, నవంబరు 25, ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఏ ఒక్క దరఖాస్తు కూడా బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాల పై అధికారులతో సమీక్షించారు..ఏట్ టు వ్యూ కు సంబంధించి 93 అర్జీలు ఇంకా చూడాల్సి ఉందని అందులో రెవెన్యూకు సంబంధించి 55 అర్జీలు ఎక్కువ శాతం పెండింగ్ లో ఉన్నాయని వెంటనే అర్జీలను ఓపెన్ చేసి చూడాలన్నారు. అదే విధంగా పోలీసు శాఖకు సంబంధించి కూడా 30 అర్జీలు ఇంకా ఓపెన్ కూడా చేసి చూడలేదని సంబంధిత అధికారి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ పోలీసు అధికారులను సూచించారు. అదే విధంగా రీఓపెన్ కేసులకు సంబంధించి రెవెన్యూలో 10, పోలీసు

శాఖలో 5 పెండింగ్ ఉన్నాయని వాటిపై ఫీల్డ్ ఎంక్వైరీ చేసి సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ ఆడిట్ చేసిన కేసులు పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖలో ఎక్కువ శాతం పెండింగ్ ఉన్నాయని అధికారులు వారి లాగిన్ లో వెరిఫై చేసి పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సిఎం గ్రీవెన్స్ కు సంబంధించి జిల్లాలో ఇంకా 17 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అందులో పత్తికొండ ఆర్డీఓ 5, కర్నూలు ఆర్డీఓ 4, సబ్ కలెక్టర్ ఆదోని 4, సహాయ కమీషనర్ దేవాదాయ, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు డిఎస్పీ, ఐసిడిఎస్ కర్నూలు వద్ద చేరొక దరఖాస్తు పెండింగ్ లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్ పై తక్షణ చర్యలు ఎస్పీ

: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 107 ఫిర్యాదులు

కర్నూలు, నవంబర్ 25, ప్రభాత వార్త : వివిధ సమస్యలతో వచ్చే ఫిర్యాదు దారుల అర్జీలపై చట్ట పరిధిలో తక్షిణ చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్పష్టం చేశారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే బాధితులకు పోలీసు పరిధిలో రక్షణ కల్పించడంలో ఎప్పుడూ ముందుంటామని ఆయన అన్నారు. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి. బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 107 ఫిర్యాదులు వచ్చాయి.

శివనామ స్మరణంలో మారు మ్రోగిన మహానంది, బోగేశ్వరము క్షేత్రాలు

: శివలింగాన్ని తాకిన సూర్య కిరకణాలు,

నంద్యాల, నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి కార్తీక మాసం చివరి రోజు కావడంతో నంద్యాల జిల్లావ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మారు మ్రోగాయి.గత నాల్గు వారాల పాటు మహిళలు కార్తీక దీపాలు వెలిగించి శివాలయాలో పూజలు చేశారు. చివరి సోమవారం కావడంతో నంద్యాల జిల్లాలో ఉన్న శైవ క్షేత్రాలైన యాగంటి, మహానంది,బోగేశ్వరము, నయనాలప్ప కానిచింత, కాలువ బుగ్గ, నంద్యాలోని నవనందులో భక్తుల తాకిడి చాలా అదికము కొనసాగింది. ఎర్రమల కొండలో ఉన్న బోగేశ్వరములో శివలింగమును సూర్యకిరణాలు తాకడముతో భక్తులు పరవసించి పోయిన లింగానికి అబిషేకము చేసి పూజలు చేశారు. అలాగే అళ్లగడ్డ వద్ద ఉన్న కానిచింతలో పూజలకు జనమం తండోపతండాలు తరలి రావడము జరిగింది. దీనితో పోలీసులు బారీ బందో బస్తు ఏర్పాటు చేసి జాతీయ రహదారికని ఒక వైపు మూసి వేసి మందోబస్తు నిర్వహించారు. ఇక మహనంది భక్తులతో కిటకిటలాడింది, వారి కోసం ఈఓ

శ్రీనివాసరెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా మూడు రోజుల నుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీనితో సోమవారము మహానందిలో భక్తులతో క్షేత్రము అంతా కిట కిటలాడింది. అదిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి అలయం కార్తీ దీపాలను వెలిగించారు. అలాఏగ చిన్నారులు సైతముదీపాలు వెలిగిండము కనిపించింది. అలాగే కాల్వ బుగ్గలో భక్తుల శివనామ స్మరణతో క్షే త్రము మారు మ్రోగింది.ఇక సంజామల మండలంలోని నయనాలప్ప క్షేతములో కూడా భక్తులు సంఖ్యలో కనిపించారు ఇక్కడ సిఐ హనుమంత్‌నాయక్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించి భక్తులను క్యూలైను పర్యవేక్షించారు. నయనానందకరము నాయనాలప్ప క్షే త్రము అక్కడున్న ఈబూది పండ్లను భక్తులు తిలకించారు.

లక్షల.. లెక్కెక్కడ..!?

(మొదటి పేజీ తరువాయి) : అధికారులు జమ చేయడం లేదు. సీఎం ఎంత సంపద సృష్టించినా ఇలాంటివి కొన్ని చాలు. ఆ సంపదకు చిల్లులు పడడానికి మరోవైపు గ్రీన్ అంబాసిడర్‌కు కూడా అందాల్సిన వేతనం అందలేదని తెలిసింది. మరి ఆ డబ్బు ఎక్కడ, గ్రామంలో దాదాపు చెత్తబుట్టలు కూడా పంపిణీ చేశారు. కానీ చెత్త ఎవరు తీసుకొని పోవడం లేదు. ఈ విషయంపై ఎంపీడీఓ దశరథరామయ్యను వివరణ కోరగా, అదికారుల బదిలీల కన్నా ముందు ఇదంతా జరిగింది. సంబంధిత రికార్డులు గ్రామ పంచాయతీకి అప్పజె ప్పలేదని తెలిసింది. ఈ సబ్జెక్టు ఈవోపీఆర్‌డీ పరిధిలోకి వస్తుందన్నారు. ఈ విషయంపై ఈవోఆర్‌డీ సంజనను వివరణ కోరగా, సంబంధిత రికార్డులు తమకు ఇంకా పూర్తిస్థాయిలో ఎవరూ అప్పజెప్పలేదన్నారు. మీరు అడుగుతున్న సమాచారం చెప్పడానికి మా వద్ద రికార్డులు లేవన్నారు. ఇప్పటి నుంచి కొత్త రికార్డులు ఏర్పాటు చేశామన్నారు. మరి ఒక్కొక్క అధికారికి ఒక్కొక్క రికార్డును సృష్టించిన ఆనవాయితీ ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు. ఏదేమైనా ఇది అందరికీ తెలిసిన విషయమే. అందరూ ఇక్కడే ఉన్నా కళ్లెదుటే ఉన్న కోడి మాయమయ్యిందన్న చందంగా ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాదనం దుర్వినియోగంగాకుండా చూడాల్సిన అవసరం ఉంది. లేదంటే ఇలాంటి ప్రజా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రోత్సహించిన వారవుతారు. ప్రతియేడాది జరిగే ఆడిట్ విషయంలో ఈ సమస్య వెలుగులోకి రాలేదా....? గ్రామ పంచాయతీ సొమ్ము దుర్వినియోగం అయినట్లు అధికారులకు తెలుసు. మరి దుర్వినియోగం చేసిన అధికారిది తప్ప, తెలిసి కూడా తమకు ఎందుకులే అంటూ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తూ నోటీసులకే ప్రాధాన్యతనిస్తున్న సంబంధిత అధికారులకు తప్పా.. మరి లక్షల లెక్కెక్కడ తేలేది ఎప్పుడో....

ఊరివాకిలి నిర్మాణానికి భూమిపూజ

ఆస్పరి,నవంబర్ 25,ప్రభాతవార్త:

మండల కేంద్రమైన ఆస్పరి మేజర్ గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించనున్న ఊరివాకిలి నిర్మాణానికి సోమవారం గ్రామసర్పంచ్ మూలింటి రాధమ్మ,గ్రామపెద్దల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు.ముందుగా స్థానిక మారెమ్మవ్వ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అక్కడినుండి మేళతాళాలతో గ్రామపెద్దలు ఊరివాకిలి బొడ్రాయి దగ్గరకు చేరుకొని వేదపండితులు రూపామోహన్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో దాదాపుగా కొన్ని స ం.లుపైగా ఊరువాకిలి లేకపోవడంతో నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషకరమన్నారు. ఊరువాకిలి నిర్మాణం తమహయాంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ప్రజల సహకారంతో పంచాయతీ నిధులతో రూ.30 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టినట్లు పేర్కిన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ మస్తాన్‌వలి,జడ్‌పిటిసి దొరబాబు,ఎంపిపి సు ంకర ఉమాదేవి భర్త రామాంజినేయులు,కెడిసిసి మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేం ద్ర,మాజీ సొసైటీ ఛైర్మెన్ కేశవరెడ్డి,ఉపసర్పంచ్ వెంకటేశ్వరమ్మ,వైస్‌ఎంపిపి తనయుడు ప్రకాష్‌యదవ్,ఎంపిటిసి భర్త తిమ్మప్ప,మాజీ టిడిపి కన్వీనర్ తిమ్మన్న,నాయకులు సతీష్‌కుమార్,దమ్మ వెంకటరాముడు,జనసేన మండల కన్వీనర్ అరవింద్,దత్తారెడ్డి,మసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవం

నందికొట్కూరుటౌన్, నవంబర్ 25, ప్రభాతవార్త :

పట్టణంలోని కోటా వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. అలయ అవరణలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్చరణలతో భాజాభజంత్రీల వాయిద్యాలతో శాస్రోక్తంగా స్వామివారి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారి అలయానికి చేరుకున్నారు. ఉదయం 5 గంటలకు స్వామి అమ్మవారికి అభిషేకములు, మంగల స్నానాలు చేయించారు. 9 గంటల నుంచి భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామి అమ్మవార్ల పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం స్వామివార్ల వీరంగం, నందికోల సేవ నిర్వహించారు.

నేడు కొత్తపల్లి మండలంలో ఎమ్మేల్యే పర్యటన

కొత్తపల్లి,నవంబర్ 25,ప్రభాతవార్త:

ఈ నెల 26న నియోజకవర్గం ఎమ్మేల్యే గిత్తా జయసూర్య పర్యటిస్తారని టిడిపి మండల కన్వీనర్ నారపురెడ్డి తెలిపారు. ముందుగా నాగంపల్లిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణి చేసి అక్కడి నుంచి కొత్తపల్లి చేరుకొని తెదేపా నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం జానాలగూడెంకు మంజూరు అయిన విధ్యుత్ సౌకర్యం కల్పించే పనులను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మేల్యే పర్యటనను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

26న చేపట్టే సమ్మెను విజయవంతం చేయండి

– ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కె.లక్ష్మిరెడ్డి

ఆదోనిలీగల్, నవంబర్25, ప్రభాతవార్త; కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం మున్సిపల్ మైదానం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కె.లక్ష్మిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు బసాపురం గోపాల్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి విజయ్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రమేష్, సీపీఐ నాయకులు హనుమప్ప తదితరులు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ దేశానికి వెన్నెముకైన రైతాంగాన్ని నడ్డి విరుస్తూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి మూడు నల్ల చట్టాలు తెచ్చారని ఆరోపించారు. వ్యవసాయం సాగు చేసే రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. అలాంటి రైతాంగన్ని ఆదుకోవడంలో కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. రైతులు పండించిన పత్తి పంటకు మార్కెట్లఓ గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆశయిస్తే రైతులు తెచ్చిన పత్తిని నిబంధనల పేరుతో కొనుగలోఓఉ చేయడం లేదన్నారు. రైతు తెచ్చిన పత్తిని ఎలాంటినిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. లేనిపోంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సీసీఐ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఉల్లి దొంగలు అరెస్టు

కొత్తపల్లి,నవంబర్ 25,ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో ఆదివారం ఉల్లిగడ్డల సంచులను దొంగలించిన ముగ్గురు దొంగలను సోమవారం అరెస్టు చేసినట్లుగా ఎస్సై కేశవ తెలిపారు. రాబడిన సమాచారంతో కర్నూలు పట్టణానికి చెందిన వడ్డెమధు, శాకీర్, ఎదురుపాడు గ్రామానికి చెందిన పూసలపాటి వెంకటేశ్వర్లు సోమవారం ఉల్లిగడ్డల సంచులను ఆటోలో ఆత్మకూరు కు వెళుతుండగా బావాపురం సమీపంలో దాడి చేసి పట్టుకొని వారి వద్ద నుంచి ఐదు ఉల్లిగడ్డల సంచులను స్వాధీనం ఏసుకొని ఆటోను సీజ్ చేసి కేసు నమోదు నట్లుగా ఎస్సై తెలిపారు.

విద్యార్థినీలు శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

– ఎంఈఓ–2 చిరంజీవిరెడ్డి

ఆలూరు,నవంబరు 25, ప్రభాతవార్త :

హాస్టల్ విద్యార్థినీలు శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ–2 చిరంజీవిరెడ్డి అన్నారు. సోమవారం ఆలూరు మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థినీలకు ప్రభుత్వం పూర్తిస్థాయి వసతులు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పది ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వార్డెన్ సుధారాణికి సూచించారు. అనంతరం ఆయన విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు.

రజకులకు పట్టణాల్లో దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలి



పత్తికొండ,నవంబరు 25,ప్రభాతవార్త

రజకులకు గ్రామాల్లో,పట్టణాల్లో దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని రజక వృత్తిదారుల సమైక్య పత్తికొండ నియోజకవర్గ సమితి,చేతివృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారన్న,రజక వృత్తిదారుల సమైక్య అధ్యక్ష,కార్యదర్శులు పెద్దయ్య,రాజశేఖర్‌లు అన్నారు. సోమవారం రజక వృత్తిదారుల సమైక్య పత్తికొండ నియోజకవర్గ సమితి,చేతివృత్తిదారుల సంఘం ఆద్వర్యంలో రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని ఆర్డీఓ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందచేశారు. రజకులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని రజకులకు గ్రామ,పట్టణాల్లో దోబీఘాట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమైక్య నాయకులు ఓబులేష్,బజారి,నరసింహులు,లవన్న,శేఖర్,గోపాల్,వీరేష్,రంగన్న,పాండు పాల్గొన్నారు.

శివపురం మసీదులో చోరీ

కొత్తపల్లి,నవంబర్ 25,ప్రభాతవార్త: శివపురం మసీదులో సోమవారం తెల్లవారుజామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. మసీదు తాళం పగులగొట్టి బియ్యం సంచి, గ్యాస్ సిలెండర్ దొంగలిఇంచినట్లు ముస్లీంలు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న వరుస దొంగతనాలపై పోలీసులు ప్రత్యేకంగా నీఘా పెట్టాలని గ్రామస్తులు కోరారు.

శ్రీ పాండురంగ అవతారంలో కోటగుడి మణికంఠుడు..!

ఆదోని అర్బన్,నవంబరు 25,ప్రభాతవార్త

పట్టణంలోని కోర్టు గుడిలో మణికంఠుడు శ్రీ పాండురంగ స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. సోమవారం గురుస్వామి బిచ్చల మోహన్‌స్వామి మణికంఠుడికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రతే్యక పూజలు నిర్వహించారు. శ్రీ పాండురంగస్వామి అలంకరణలో ఉన్న అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా గురుస్వామి బిచ్చల మోహన్‌స్వామి మాట్లాడుతూ శ్రీ మణికంఠ సేవా సంఘం ఆద్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా ప్రతి రెండ్రోజులకోసారి అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించడం జరుగుతుందన్నారు. అయ్యప్పకు ప్రత్యేక అలంకరణలు చేసి అయ్యప్పను కన్నులారా చూసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కోర్టుగుడిలో మాల ధరించిన అయ్యప్ప భక్తులకు డిసెంబరు 8వ తేదీన 18వ పడి పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ మణికంఠ సేవా సంఘం తరుపున సన్మాన కార్యక్రమం ఉంటుందని అలాగే హోమ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు శివస్వామి,టైల్స్ శ్రీనివాసులు స్వామి,జయరాం,భాస్కర్,రామస్వామి,క్రిష్ణస్వామి,రామచంద్రస్వామి,చంద్రమోహన్ స్వామి,మణికంఠ స్వామి,మంజునాథ్ స్వామి,ఈశ్వర్‌రెడ్డి స్వామి,శంకర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

కరెంటును పొదుపుగా వాడుకోండి..

:– విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్‌రెడ్డి

తుగ్గలి,నవంబరు 25,ప్రభాతవార్త : మండలంలోని ఎస్‌సిలు కరెంటును పొదుపుగా వాడుకోవాలని విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌సిలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న 200యూనిట్ల కంటే అధికంగా కరెంటును వాడితే తప్పక బిల్లును చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. ఇటీవల కొన్ని ఎస్‌సి కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న యూనిట్ల కంటే అధికంగా కరెంటు వాడకం జరిగితే అలాంటి వారు తప్పక బిల్లు చెల్లించాలని సూచించారు. అందుకే ఎలక్ట్రికల్ హీటర్లతో పాటు పలు ఎలక్ట్రికల్ పరికరాలను వినియోగించరాదని సూచించారు. ఎలక్ట్రికల్ హీటర్లు వాడడం వల్ల విద్యుత్ శాఖకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.

లింగ వివక్షను నిర్మూలిద్దాం..

తుగ్గలి,నవంబరు 25,ప్రభాతవార్త : లింగ వివక్షను విడనాడి మహిళల పట్ల గౌరవంతో మెలగాలని తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఓ విశ్వమోహన్ ,ఏపిఎం రాధాకృష్ణ,ఎస్‌ఐ కృష్ణమూర్తిలు సూచించారు. మండల కేంద్రమైన తుగ్గలిలోని ఎంపిడిఓ కార్యాలయం నందు జెండార్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో మండల స్థాయి కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ విశ్వమోహన్ మాట్లాడుతూ వివక్ష విడనాడి ఆడ,మగ సంతానం ఇద్దరినీ సమానంగా చూసినప్పుడే సమాజంలో మహిళల పట్ల చులకన భావన పోతుందన్నారు. దీంతో ఆడ,మగ ఇద్దరు సమానమే నన్ను సమదృష్టిని ప్రతిఒక్కరు అలవరచుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలలో వివిధ వ్యక్తుల మద్దతుతో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు,వైద్యాధికారి ప్రవీణ్ కుమార్,ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వర్‌రెడ్డి,అంగన్‌వాడి సూపర్‌వైజర్లు,టీచర్లతో పాటు మరింతమంది ఆయా శాఖల అధికారులు,పెద్దలు పాల్గొన్నారు.

ఆడ మగ సమానంగా అన్నిరంగాలలో ఎదగాలి

– ఎపిఎం కళావతి

పగిడ్యాల, నవంబరు 25,ప్రభాతవార్త : అడమగ తేడాలేకుండా సమానంగా అన్నిరంగాలలో ఎదగాలనీ ఎంపిఎం కళావతి అన్నారు. స్థానిక స్రీశక్తిభవనంలో జాతీయ నేషనల్ జెండర్ క్యాంఫెన్ ప్రారంభములో భాగంగా సోమవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎపిఎం కళావతి మాట్లాడుతూ ఈనెల 25నుండి డిశంబరు 23వతేదీవరకు జండర్ క్యాంపెన్ వుంటాయన్నారు.అడమగ సమానంగా అన్నిరంగాలలో ఎదగాలన్నారు. ఆడమ గవాళ్లు సమానంగా పనిచేయడంలో పాలుపంచుకోవాలన్నారు. అన్నివిషయాలలో సమానంగా చూసుకోవాలనీ తేడా వుండ కూడదనీ ఈ విషయాన్ని అందరు గమ నించాలనీ ఎపిఎం కళావతి సూచించారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు



కౌతాళంరూరల్, నవంబర్25, ప్రభాతవార్త; కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ టీడీపీ జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లను సోమవారం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, తెలుగు యువత నాయకులు సతీష్‌నాయుడు, సురేష్‌నాయుడు కలిశారు. ఈ మేరకు కర్నూలులోని వి.ఎన్.కన్వెన్షన్ హాల్‌లో కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పదవులు మరెన్నో పొందాలని, కర్నూలు ప్రాంతాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, అయ్యన్న, రామకృష్ణ, నర్సిరెడ్డి, లక్ష్మయ్య, జ్ఞానేష్, హరివిలి వీరేష్, వీరారెడ్డి, శివ చూడి, వెంకటేష్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దికెరలో జెండర్ హింసకు వ్యతిరేకంగా ప్రచారం

మద్దికెర,నవంబరు 25,ప్రభాతవార్త

జెండర్ హింసకు వ్యతిరేకంగా జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ హుస్సేన్‌సాహెబ్,ఎంపిడిఓ కొండయ్యలు మాట్లాడుతూ జాతీయ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచారం నేటి నుంచి డిసెంబరు 23వరకు వివిధ స్థాయిలలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రంగస్వామి,ఏపిఎం రామాంజనేయులు,గోవింద్,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణ పనులు నాణ్యతతో నిర్మించాలి

:– నాబార్డ్ సుబ్బారెడ్డి

మద్దికెర,నవంబరు 25,ప్రభాతవార్త : మండల కేంద్రమైన మద్దికెరలో నాబార్డు వారి నుండి రూ.15లక్షలు మరియు రూ.3లక్షలు గ్రామ పెద్దల విరాళంతో కలిపి మొత్తం రూ.18లక్షలతో మద్దికెరలో కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు 95శాతం పూర్తయిన క్రమంలో కర్నూలు జిల్లా డిఎంఎం నాబార్డు సుబ్బారెడ్డి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ హాట్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి సకాలంలో 95శాతం పనులు పూర్తికావడం చాలా సంతోషకరమన్నారు. మిగిలిన ఐదు శాతం పనులను ఈ నెలలోపు పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తొందరగా నిర్వహించాలని కమిటీ సభ్యులను మరియు నవ యూత్ అసోసియేషన్ సంస్థ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నవ యూత్ అసోసియేషన్ సంస్థ సిఈఓ నరసింహులు,పంచాయతీ సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపిడిఓ కొండయ్య,బ్యాంక్ మేనేజర్ వెంకటేష్‌గౌడ్,ఆంజనేయులు,నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, బాలచంద్ర,రైతులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పాదయాత్ర

– అయ్యప్పస్వామి దేవాలయం నుంచి గ్రామపెద్దలు,అయ్యప్ప,శివస్వాములతో కలిసి బ్రహ్మగుండానికి పాదయాత్ర

వెల్దుర్తి,నవంబర్25,ప్రభాతవార్త : గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుతూ వెల్దుర్తి పట్టణ సమీపంలోని జర్నలిస్టు కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరసద్గురుసాయినాథ అయ్యప్పస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా బ్రహ్మగుండానికి అయ్యప్ప, శివస్వాములు, గ్రామపెద్దలు కాలినడకన పాదయాత్ర చేసుకుంటూ బ్రహ్మగుండానికి చేరుకున్నారు.దారిపొడవున అయ్యప్ప,శివస్వాములు భక్తిగీతాలను పఠిస్తూ బయలుదేరారు.ఈ పాదయాత్రలో అయ్యప్పస్వాములు తలపై నూతనవస్త్రాలు,బియ్యం,బ్యాళ్లు,పూలమాలలు,పూజాసామాగ్రి తీసుకెళ్లి శ్రీ కామేశ్వరిదేవి సహిత బ్రహ్మేశ్వరస్వామికి సమర్పించారు.అక్కడ బ్రహ్మగుండంలో బ్రహ్మేశ్వరస్వామికి అభిషేకంతో పాటు,అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు మాజీ ఎంపిపి బొమ్మనదశరథరామిరెడ్డి,తిరివీధిసాయిప్రసాద్,టి.ఇ.బలరాంగౌడ్,బొమ్మనరమాకాంత్‌రెడ్డి,సుధాకర్‌గౌడ్,బి జెపినాయకురాలు శాంతి,అయ్యప్పస్వాములు చిరంజీవి,గోపినాథ్‌నాయుడు,శ్రీనివాసులు,ప్రసాద్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

– భక్తులతో పొటెత్తిన బ్రహ్మగుండం...భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు...

వెల్దుర్తి మండలంలోని శివాలయాలతో పాటు ఇతర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.కార్తీకమాస చివరి సోమవారం కావడంతో బ్రహ్మగుండం పుణ్యక్షేత్రంలో భక్తులతో పొటెత్తింది.పవిత్రకొనేరులో స్నానమాచరించి బ్రహ్మేశ్వరస్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.ఆర్యవైశ్యఅన్నదాన సత్రంలో తిరివీధి మధుసూధన్‌శెట్టి కుమారుడు అమర్‌నాథ్‌శెట్టి అన్నదానంను, బ్రహ్మేశ్వరమైన్స్ అధినేత గౌరివెంకటరామి రెడ్డి భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశారు.అదేవిధంగా పట్టణంలోని పశులోనిదేవాలయం, సిద్ధేశ్వరస్వామిఆలయం,బొమ్మిరెడ్డిపల్లిలో భీమలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

ఏడూర్ల గవిలో శివుడికి ప్రత్యేక పూజలు

– గంగా ఉమాసమేత సర్వేశ్వరుడికి పంచామృతాభిషేకాలు
– సర్వేశ్వరుడి వద్ద దీపాలు వెలిగించిన మహిళలు
– గవి వద్ద భక్తులకు అన్నదానం చేసిన గడివేముల గ్రామ ప్రజలు
– ఎన్నడూలేనివిధంగా భక్తులతో కళకళ్లాడిన ఏడూర్లగవి

గడివేముల, నవంబర్25, ప్రభాతవార్త; మండలంలోని పైబోగుల గ్రామం వద్ద ఉన్న సహజ సిద్ధమైన కొండల్లోని ఏడూర్లగవిలో కార్తీకమాసం చివరి సోమవారం పురష్కరించుకుని గంగా ఉమా సమేత సర్వేశ్వరుడికి భక్తులు పెద్ద ఎత్తున ఆలయంకు చేరుకుని ప్రత్యేక పూజలు, కాయ కర్పూరం సమర్పించి, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గడివేముల గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామివారి దర్శనార విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడూర్లగవి పూర్వం దివిటీ దొంగల నుంచి కాపాడడానికి ప్రజలకు ఆశ్రయం ఇచ్చిందని ప్రసిద్ధి. చుట్టూ ఎలాంటి నీటి వసతి లేనప్పటికీ ఈ ప్రాంతంలో గవి లోపల గల శివుడికి సహజ సిద్ధంగా ఏర్పడిన నీటిబొట్లు నిత్యం అభిషేకం చేస్తాయి. నమ్మశక్యంకాని మిస్టరీలొన్న ఈ కొండ ప్రాంతంలో ఇంకా మనకు కనిపించని అనేక విశేషాలు ఉన్నాయి. ప్రతిఒక్కరూ సందర్శించాల్సిన ప్రాంతం ఏడూర్లగవి. గడివేముల నుంచి పైబోగులకు బస్సు మార్గాన చేరుకుని అక్కడి నుంచి కాలినడకన మూడు కి.మీ. నడిచి ఏడూర్ల గవి గుహకు చేరుకోవచ్చు. ఒకప్పుడు గుహలోకి చేరుకోవాలంటే చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు కొంతమంది దాతల సహకారంతోగుహ వద్దకు చేరుకునేందుకు, గుహ లోపలికి సులువుగా చేరుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

పగిడ్యాలలో 25యేళ్లుగా కార్తీకమాసంతో.. ప్రతియేట బన్నూరు వంశస్తులు అన్నధానం

పగిడ్యాల, నవంబరు 25, ప్రభాతవార్త

తల్లిదండ్రుల మాట ప్రకారం కుమారులు జవదాట కుండా పాతిక సంవత్సరాలుగా కార్తీకమాసంలో ప్రతియేట అన్నధానం చేస్తూవస్తున్నారు. పగిడ్యాల గ్రామంలో బన్నూరు వంశస్తులు. కార్తీకమాసం చివరి సోమవారం పగిడ్యాలలోని స్థానిక శివాలయంలో అన్నధానం చేశారు. బన్నూరు వంశస్తులు. ఆలయంలో శ్రీనివాసరెడ్డి దంపతులు అభిషేకం ప్రతేక పూజలు చేశారు. అనంతరం అన్నధానం చేశారు. 1999వ సంవత్సరంలో అన్నధానం చేసేందుకు బన్నూరు వంశస్తులు శ్రీకారం చుట్టారు. పగిడ్యాల మాజీ సర్పంచ్ కీ.శే.బన్నూరు సుబ్బారెడ్డి, కీ.శే.బన్నూరు శివారెడ్డి, కీ.శే.బన్నూరు వెంకటరెడ్డి, కీ.శే.బన్నూరు రామకృష్ణారెడ్డి, కీ.శే.నారాయణరెడ్డి, కీ.శే.రామ చంద్రారెడ్డి మృతి చెందినా తల్లిదండ్రులు శ్రీకారం చుట్టిన కార్యక్రమాన్ని కుమారులు కొనసాగిస్తు న్నారు. కార్తీకమాసం చివరి సోమవారం అన్నధానం చేస్తూవస్తున్నారు. ప్రతి సంవత్సరం అన్నధానం చేయాలని 1999లో నిశ్చయించుకుని ఒక నిధిని ఏర్పాటు చేశారు. వారి తల్లిదండ్రులు మృతి చెందినా వారి కుమారులు, మనుమలు పెద్దలు ఏర్పాటు చేసిన నిధిద్వారా ప్రతి సంవత్సరం కార్తీకసమాసం ఆఖరి సోమవారం అన్నధానం చేస్తూవస్తున్నారు. పాతిక సంవత్స రాలుగా అన్నధానం చేస్తూవస్తున్నారు. ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొనడంతో పాటు ప్రభుత్వ ఆయాకార్యాలయాలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, పాల్గొనడం విశేషం, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరాముడు, ఎంపిడిఓ శ్రీమతి సుమిత్రమ్మ, ఎంఈఓ -2 మురళీ మోహన్‌రెడ్డి, ఎంపిఓ మద్దిలేటి,ఎపిఎం కళావతి, జెడ్పీటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పల్లె అరుణమ్మ, సర్పంచ్ పెరుమాల శేషన్న, టిడిపి నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, బొగ్గుల దామోదరెడ్డి, బన్నూరు వంశీయులు శ్రీధర్‌రెడ్డి, దేవోత్తమరెడ్డి, కీ.శే.యుగంధరెడ్డి, వేమారెడ్డి, మురళీధరెడ్డి, రాజశేఖరెడ్డి, చంద్రశేఖరెడ్డి, జయరా మిరెడ్డి, రాజశేఖరెడ్డి, నందికొట్కూరు నందిజూ నియర్ కళాశాల ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, కోటి వెంకటేశ్వర్లు, శివశంకరెడ్డి, పల్లె మురళీధరెడ్డి, ఆంజనేయనగర్ బచ్చు శివారెడ్డి, బొగ్లు శివారెడ్డి, గంగిరెడ్డి గారి సత్యనారాయణరెడ్డి, గంగిరెడ్డిగారి రమాదేవి. పుల్యాల నాగశేఖరెడ్డి, శివానందభారతీస్వామిజీ, బన్నూరు వంశస్తులు, వారి ఆడపడుచులు, అల్లుల్లు, మనుమలు మనుమరాళ్లు గ్రామపెద్దలు, పారిశుధ్యకార్మికులు, కావలికాల్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అదానిని అరెస్టు చేయాలనీ కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన సిపిఎం

పగిడ్యాల, నవంబరు 25,ప్రభాతవార్త

దేశసంపదతోపాటు రాష్ట్రసంపదను లూటీచేసిన పారిశ్రామికవేత్త ఆదానిని వెంటనే అరెస్టు చేయాలనీ సిపిఎం మండల కన్వీనర్ పి.పక్కీర్‌సాహెబ్ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భగా సిపిఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ ప్రధానిమోడీ కి అత్యంత సన్నిహితుడైన ఆదాని సౌరవిద్యుత్ కాంట్రాక్టర్లకు చకి ్కంచుకోవడం కోసం కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలలో ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులకు భారీ ఎత్తున ముడుపులు అప్పజెప్పినట్లు వస్తున్న వార్తలపై ప్రధాని స్పందించాలన్నారు. ఆదాని అవినీతి సామ్రాజ్యం వెనుక ప్రధానిమోడీ అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అంతర్జాతీయ ఆర్థిక నేరస్తుడైన ఆదానితో పాలకుల ఒప్పందాలు బహిర్గతం చేయాలన్నారు. తక్షణమే ఆదానిని అరెస్టుచేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామనీ హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శివరాముడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిక్కస్వామి, ఉశేనమ్మ, ఈశ్వరమ్మ, వీరమ్మ, ఈదెన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేలబెలుం మల్లేశ్వరస్వామి తిరుణాల

కొలిమిగుండ్ల, నవంబర్25, ప్రభాతవార్త: కొలిమిగుండ్ల మండల పరిధిలోని బందార్లపల్లె గ్రామంలో వెలసిన నేలబెలుం మల్లేశ్వరస్వామి తిరుణాల సోమవారం అంగరంగ వైభవంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వ హించారు. కార్తీక కడసోమవారాన్ని పురస్కరించుకుని ఈ ఆలయంలో మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయానికి అతి ముఖ్యంగా ఉన్న గుహలో భక్తులు ప్రత్యేక స్నానాలు ఆచరించారు. కొలిమిగుండ్ల మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాతం కళ్యాణ్‌రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలాయిపల్లె, మదనంతపురం, అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, కనకాద్రిపల్లె, ఇటిక్యాల తదితర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాతం చంద్రహాస్‌రెడ్డి, బందార్లపల్లె ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కక్షిదారుల హక్కుల చట్టాలను కాలరాయవద్దు

ఏపిపి మైల బాబు రాజేంద్రప్రసాద్

ఆత్మకూరు,నవంబర్25,ప్రభాతవార్త: కక్షిదారుల హక్కుల చట్టాలను కాలరాయవద్దని ఆత్మకూరు ఏపిపి మైల బాబు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కోర్టు భవనంలో పోలీసు, అటవీశాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులతో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిపి మాట్లాడుతూ ఆత్మకూరు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ప్లస్ క్లాసు పరిధిలో ఉన్న కక్షిదారుల అరెస్టుకు కారణాలు హక్కులు తెలియపరిచే విదంగా సెక్షన్ 47 బిఎన్ఎస్ఎస్ అర్టికల్ 22 క్లాజ్ 1 కేసులలో పూర్వపరాలంటిని పరిశీలన చేసే విదంగా అధికారులు సహకరించాలని అన్నారు. న్యాయసేవ విస్తృత సేవలపై భవిష్యత్‌లో ముద్దాయిలకు గల హక్కులను వాటి విస్తృత పరిధిని మించి చట్టాలు ఉన్నాయని సూచించారు. ఈ సమావేశంలో అటవీశాఖ రేంజ్ అధికారి రామకోటి, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, ఎక్సైంజ్ సిఐ కిషోర్‌కుమార్, ఎఫ్ఎస్ఓలు జ్యోతిస్వరూప్, డిప్యూటి రేంజ్ అధికారి వెంకటరమణగౌడ్, ఎఫ్ఎస్ఓలు మగ్బుల్, అటవీశాక సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి ; ఎంపీడీఓ వరలక్ష్మి

- హాలహర్విలో నయీ చేతన్ జెండర్ వ్యతిరేక కార్యక్రమం

హాలహర్వి, నవంబర్25, ప్రభాతవార్త;

బాల్యవివాహాలను అరికట్టాలని ఎంపీడీఓ వరలక్ష్మి, తహసీల్దార్ నజిభాను అన్నారు. నయీ చేతన్ జెండర్ వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేక ఎంతోమంది పిల్లలకు బాల్యవివాహాలు చేస్తూ పిల్లల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. చిన్న వయస్సుల్లోనే వివాహాలు చేయడం వల్ల పిల్లలు మానసికంగా, శారీరకంగా అనారోగ్యాలకు గురవుతారని వారు సూచించారు. పిల్లలను బడికి పంపించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శివయ్య, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు నిరంజన్‌కుమార్, మంజునాథ్, రామాంజనేయులు, శ్రీనివాసులు, ఈరన్న తదదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సర్వేలకు పట్టణ ప్రజలు సహకరించండి

: ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ ఎల్.రమేష్‌బాబు

ఆత్మకూరు,నవంబర్25,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేరవేసే విదంగా మున్సిపల్ అధికార యంత్రాంగం సర్వేలను నిర్వహించడం జరిగిందని ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ ఎల్.రమేష్‌బాబు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలు సచివాలయ సిబ్బందికి మున్సిపల్ అధికారులకు తమ ఇళ్ళ దగ్గరకు వచ్చిన్నప్పుడు సహకరించే విదంగా ముందుండాలని అన్నారు. నవంబర్ 30వతేది లోప ఈ సర్వేలను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. అన్ని రకాల గృహాలకు జియోట్యాగింగ్, హౌస్‌హోల్డ్ ఫోటో కాప్చరింగ్ ద్వారా నేషనల్ పేమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా సిటిజన్స్ యెక్క బ్యాంకు ఆకౌంట్‌కు మ్యాపింగ్ చేసుకోవడం జరుగుతుందన్నారు. క్లస్టర్‌లకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, డేటబేస్, మిస్సింగ్ సిటిజన్ జతపరిచే విదంగా ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు, మహిళలు, సర్వేలకు అనుగునంగా ఉండాలని తెలిపారు.

జెండర్ ఆధారిత హింస నిర్మూలనపై ర్యాలీ

ఆదోని,నవంబరు 25,ప్రభాతవార్త

పట్టణంలోని స్త్రీశక్తి భవనం నందు ఎపియం ఆధ్వర్యంలో సోమవారం ఈఓఆర్‌డి అధ్యక్షతన జెండర్ క్యాంపెయిన్‌పై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం,ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఏ ఏపిఎం కెసి వీరన్న మాట్లాడుతూ ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశ్యం జెండర్ ఆధారిత హింసను నిర్మూలించడం అన్నారు. అలాగే మహిళల చేత జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిసిలు రవికుమార్,సౌజన్య,నాగలక్ష్మి,ప్రసన్న,రాణి,నరసింహులు, అకౌంటెంట్ రాఘవేంద్ర,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భార్గవి,లీలావతి,మహిళా పోలీస్ సిబ్బంది,అంగన్‌వాడి సిబ్బంది,ఆశా వర్కర్స్,మహిళా సంఘాల సభ్యులు,విఓఏలు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి..

:-స్త్రీలపై జరుగుతున్న హింసా నివారణపై సదస్సు..

కోసిగి, నవంబరు 25, ప్రభాతవార్త

సమాజంలో మహిళలలు, బాలికలు ఇంటిలోని, సమాజంలో అనేక రకాల హింసకు గురవుతున్నారని స్త్రీలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు, నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆర్‌డిటి ఏటిఎల్ కృష్ణయ్య అన్నారు.. అంతర్జాతీయ స్త్రీ హింసా నిర్మూలన దినం సందర్భంగా ఆర్డీటి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్సీ కమ్యూనటి హాలు నందు మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాలలోని పలువురు భార్యభర్తలకు అవగాహన సదస్సును నిర్వహించారు..ముందుగా విద్యార్థిని విద్యార్థులతో హింసకు వ్యతిరేకంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు.. అనంతరం ఈ సదస్సులో కృష్ణయ్య మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక హింస, సైబర్‌నేరాలు, మానసికంగా వేధించడం జరుతోందన్నారు.. నేటికి కూడా దేశంలో చాలమంది స్త్రీలకు గృహహింస చట్టంపై సరైన అవగాహన లేదని, అందువల్ల ప్రతి స్త్రీ కూడా హక్కులు చట్టాలు గురించి పూర్తి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.. ఈ చట్టాలు ద్వారా భౌతిక హింసలు, భౌతిక దాడుల నుంచి రక్షణ పొందగలరన్నారు.. ఇంకా దేశంలో 29 శాతం మంది స్త్రీలు నేటీకి కూడా గృహ హింసకు గురవుతున్నారన్నారు..ప్రతి స్త్రీ వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాల గురించి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, అప్పుడే ఈ హింస నుండి మహిళలు, బాలికలు విముక్తి పొందడానికి అవకాశం ఉందన్నారు..సమాజంలో ఉన్న స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించి భార్య భర్తలు గౌరవ ప్రదమైన సంసార జీవితాన్ని గడపాలన్నారు.. ముఖ్యంగా సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దౌర్జన్యాలు అరికట్టే బాధ్యతలను గ్రామస్థాయిలో ఉండే సోషల్ యాక్షన్ టీమ్(ఎస్ఎటి)లీడర్లు సమర్థవంతగా నిర్వర్తించే విధంగా ప్రోత్సాహించడం కోసమే ఈ అవగాహన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు..అందుకే మార్పు అనేది మన ఇంటి నుండే మొదలు కావాలని పిలుపు నిచ్చారు..ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, మోడల్ స్కూల్ హిమబిందు ఆర్డీటి సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు..

పంట భీమాతో రైతులకు రక్ష

వెలుగోడు,నవంబర్ 25,ప్రభాతవార్త: మండల పరిధిలోని గుంతకందాల, వవెలుగోడు గ్రామంలోని వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో ముమ్మురంగా వరి కోతలు చేపడుతున్నారని దిగుబడులు 35 నుండి 40 బస్తాల వరకు ఎకరాకు నికరంగా వస్తుందని ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని ఏవో తెలిపారు. రైతులు రబీలో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద పంట భీమా చేసుకోవాలని రైతులను కోరారు. ఆకాల వర్షాలకు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు పంట నష్టపోయిన రైతులకు భీమా రక్షణగా ఉంటుందని ఆయన తెలిపారు. బ్యాంకులలో ఋణాలు తీసుకున్న రైతులు అలాగే కౌలు రైతులు మీ సేవా ద్వారా లేదా పంట ఋణం పొందిన బ్యాంకు ద్వారా పంట భీమా ప్రీమియం చెల్లించి ఈ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అంజిత్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి అప్సర్ అర్పత్ రైతులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవు

: ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు

తుగ్గలి,నవంబరు 25,ప్రభాతవార్త : ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ-1 రమా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలోని నోవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను తనిఖీ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే పదవ తరగతి విద్యార్థులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నోవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల నుండి పబ్లిక్ పరీక్ష ఫీజును అధికంగా వసూలు చేశారని,పదవ తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో కొన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని తమ దృష్టికి రావడంతో పాఠశాలను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కొరకు అధిక ఫీజులను వసూలు చేశారా..అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారా..అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉన్నారని పదవ తరగతి పరీక్షలతో పాటు అసైన్మెంట్,కాంపోజిషన్,రిటన్ టెస్టుల కొరకు ఫీజులు చెల్లించడం జరిగిందని విద్యార్థులు తెలపడం జరిగిందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా అధికంగా వసూలు చేసినట్లయితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ తిప్పయ్యతో పాటు గణిత ఉపాధ్యాయుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మండలంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం..

:- చిప్పగిరి ఎంపిడిఓ అల్లాబకాష్

చిప్పగిరి,నవంబరు 25,ప్రభాతవార్త : మండలంలో మారుమూల గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కారం చేస్తామని చిప్పగిరి ఎంపిడిఓ అల్లాబకాష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ప్రతి సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ అల్లాబకాష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏవైన సమస్యలు అర్జీల రూపంలో వస్తే వాటిని సంబంధిత గడువులోపల పరిష్కారం చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్,ఇంచార్ జ ఈఓపిఆర్‌డి బాలన్న,వెలుగు ఏపిఎం నాగార్జున,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న,మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి,హౌసింగ్ ఏఈ భవ్య హాజరు కాగా ఆర్‌డబ్ల్యుఎస్,పంచాయతీ రాజ్,ఆర్‌అండ్‌బి,ఆరోగ్య శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

మద్దికెరలో అనారోగ్యంతో విఆర్‌ఏ సుంకన్న మృతి

మద్దికెర,నవంబరు 25,ప్రభాతవార్త : మద్దికెర మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం నందు విధులు నిర్వహిస్తున్న గుండాల సుంకన్న సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తెదేపా జిల్లా పార్లమెంట్ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు సుంకన్న ప్రజలకు చేసిన సేవలను కొనియా డారు. అందరితో అన్యోన్యంగా కలిసిమెలసి తిరిగేవాడని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చూకూరాలని ఆశిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈద్గానగర్ ఆర్చ్‌గేట్ ప్రారంభం

గూడూరు,నవంబర్ 25, ప్రభాతవార్త ః

గూడూరు పట్టణంలో ఈద్గానగర్‌లో స్థానిక ముస్లీం సోదరులు నిర్మించిన ఆర్చ్‌గేట్‌ను సోమవారం జమాలున్ రెహమాన్,నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు,వైస్ చైర్మన్ అస్లాంలు ప్రారంభించారు. అనంతరం జమాలుల్ రహమాన్ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ రెండవ చైర్మన్ లక్ష్మన్న,కౌన్సిలర్లు ఖలీల్ భాష,కోఆప్సన్ మెంబర్ మదర్ సాహెబ్,మద్దిలేటి,దండుశ్రీను,స్థానిక ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

కల్లూరులో వై.యస్.యన్. రెస్టారెంట్ ప్రారంభం...

కర్నూలు అర్బన్ నవంబర్ 25, ప్రభాతవార్త : వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి కల్లూరు 32వ వార్డు లో వై. యస్. యన్ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యకరమైన రుచికరమైన వంటలు చేయటం వలన ప్రజలు ఆహారాన్ని ఆస్వాదిస్తారని అన్నారు. హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

జేసీ డాక్టర్ నవ్యను కలసి వినతి పత్రం అందజేసిన ఏపీయూడబ్ల్యూజే నేతలు

కర్నూలు, నవంబర్ 25, ప్రభాతవార్త : కర్నూలు జిల్లాలో వివిధ పత్రికలు, చానల్స్ లో పని చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ సమితి సభ్యులు జీ కొండప్ప, కే నాగరాజు ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్ వీ సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నాయకులు హరికిషన్, సురేష్, సుంకన్న, ఖలీల్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శులు శివ, అవినాష్ జేసీ డాక్టర్ నవ్య ను కోరారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో జేసీని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు జేసీ తో మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో సుమారు 400 మందికి పైగా జర్నలిస్టులు వివిధ పత్రికలు, చానల్స్ లో పని చేస్తున్నారన్నారు. అయితే చాలా మంది జర్నలిస్టులు చాలీ చాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఉన్న సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, అన్యాయాలు, సమస్యలను ఎప్పటికప్పుడు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో తమ పిల్లలకు సరైన విద్యను అందించలేని పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. గతంలో ఉన్న కలెక్టర్లు జర్నలిస్టులకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో చదివే జర్నలిస్టుల పిల్లలకు మొత్తం ఫీజులో 60 శాతం రాయితీ ఇవ్వాలని గతంలో పనిచేసిన కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ఈ సారి సర్క్యూలర్ జారీ చేయకపోవడం తో జిల్లాలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఫీజు రాయితీ ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక జిల్లాలు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో ఉచిత విద్య, సగం ఫీజు రాయితీ ఇవ్వాలని సర్క్యులర్లు ఇవ్వడం జరిగిందన్నారు. కర్నూలు జిల్లాలో మాత్రం ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మొత్తం ఫీజులు 60 శాతం ఫీజు రాయితీ ఇచ్చే విధంగా సర్క్యులర్ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన జేసీ డీఈఓ సామ్యూల్ పాల్ ను పిలిచి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. దీనిపైన స్పందించిన డీఈఓ వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ లభించే విధంగా సర్క్యులర్ ఇస్తామని చెప్పారు. జేసీ ని కలసిన వారిలో ఎమ్మిగనూరు తాలూకా అధ్యకుడు శ్రీనివాస్ నాయుడు, నాయకులు రామయ్య, భాస్కర్, మురళీ, రంగ, మల్లికార్జున, చాంద్, గంగాధర్, ఫోటో గ్రాఫర్ రఫీ, కెమెరామెన్లు రాజు, రఫీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి పాలసీ కొండంత అండ

పత్తికొండ,నవంబరు 25,ప్రభాతవార్త

ప్రతి వ్యక్తి జీవిత భీమా పాలసి చేసుకుంటే ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ పాలసి కొండంత అండగా నిలుస్తుందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డిఓ శంకరయ్య,పత్తికొండ మేనేజర్ నారాయణరెడ్డిలు అన్నారు. శనివారం పట్టణానికి చెందిన 53సం॥ల కమిటీదార్ మహబూబ్ బీ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఏడాదికి రూ.60వేల ప్రీమియం పాలసీ తీసుకోవడం జరిగిందని ఇటీవల మహబూబ్ బీ సహజ మరణం పొందారని దీంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా క్లైమ్‌లో భాగంగా రూ.4,50,000ల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును నామిని అయిన కమిటీదార్ శర్మస్ హుస్సేన్‌కు డిఓ శంకరయ్య,పత్తికొండ మేనేజర్ నారాయణరెడ్డి,కోడుమూరు మేనేజర్ జయవీర,డిఓ ధనుంజయలు చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాట్స్,నిక్కర్లు వేసుకుని రాకూడదు..!

:- హుకుం జారీ చేసిన తహశీల్దార్

మద్దికెర,నవంబరు 25,ప్రభాతవార్త : మద్దికెర మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయాలకు షాట్స్,నిక్కర్లు వేసుకుని రాకూడదని తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్ సోమవారం హుకుం జారీ చేశారు. వివిధ గ్రామాల నుండి యువకులు ఈ వస్త్రధారణలతో ఆఫీసులకు రాకూడదని అలా వస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకో

సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్‌యస్

పిజిఆర్ యస్‌కు దరఖాస్తులు 124

నంద్యాల, నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి

ప్రజా పిర్యాదుల పరిస్కారంపై ప్రభుత్వం అదిక ప్రాదాన్యతిస్తున్న నేపద్యములో నాణ్యతతో నిర్ణత గడువలోగా పరిస్కారించేందుకు జిల్లా అదికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టరు విష్ణుచరణ్ అదేశించారు. సోమవారము కలెక్టరేట్‌ని పిజఆర్‌యస్ హాలులో ప్రజా సమస్యల పరిస్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలనుండి వచ్చిన ప్రజల నుండి అరి .జలను స్వీకరించారు. జేపిలో పాటు డిఆర్ఓ రామునాయక్ స్పెషల డిప్యుటి కలెక్టర్లుఉ అదికారులు పాల్గొన్నారు. ఈసందర్భమగూ జేపి మాట్లాడుతూ ప్రజా సమస్యలకు అదిక ప్రాదన్యాత నిచ్చి సత్వరమే నిర్ణిత కాల వ్యవదిలోగా పరిస్కారించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదికారులను అదేశించారు.పిజిఆర్‌యస్‌లో ఇంకా పెండింగులో ఉన్న 77 పిర్యాదులను బియాండ ఎస్ఎల్ఎ లోగా పరిస్కారించాల న్నారు. వచ్చేవారము రాష్ట్ర ముఖ్యమంత్రిచే జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సు ఉండే అవకాశము ఉందని ఈలోగా పిర్యాదులన్నీ క్లియర్ కావాలని జేపి తెలిపారు. రెవెన్యు సర్వే పంచాయితీరాజ్‌ల సివిల స్లే పోలీసు తదితర శాఖలో

అదిక సంఖ్యలో పెండింగున్నాయని అర్జీవోలు సంబందిత అదికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వితిన్ ఎస్ఎల్ఎలోగా పరిస్కారించాలన్నారు. సియంఓ కార్యాలయలవు పిర్యాదులు కూడా 67 పెండింగులో వున్నాయని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగులో ఉన్న ఉపి సేవా సర్వీసులపై సంబందిత అదికారులు ప్రత్యేక దృష్టి సారించి రీగసర్వేకి సంబందించి సూచించిన నాలుగ ప్రాఫార్మల్లో వివరాలు పొందుపరచి మంగళవారము సాయంత్రములోగా అందజేయాలని అర్జిలో తహశీలుదారును జేపి అదేశించారు.

ప్రజా సమస్యల వేదికలో వచ్చిన అర్జిలు

గ్రామ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్నపవైద్య శాఖ ఉద్యోగులకు ఈగ నెల 30 తెదిలోపు ఎన్ని బ్యాంకు అకౌంట్ మాప్పింగ్ జియో ట్యాగింగ్ చేయాలిన ప్రభుత్వం అదేశాలు జారీ చేసియున్నారని ఇందుకు సంబందించి పనులు పూర్తి చేసేందుకు మరికొంత సమయంల ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ఉనైటెడ్ వరాడ్డ మరియు గ్రామ హెల్త్ సెక్రటరీ వెల్ఫేరు అసోషియేషన సభ్యులుజేసిని కోరారు. అత్మకూరు మండలంనల్లకాలువ గ్రామ వికలాంగ వ్యాప్తవ్యుడు వెంకటస్వామిప్రభుత్వం తనకు మంజూరు చేసిన ట్రైసైకిల్ వినియోగించుటలో ఇబ్బంది పడుతున్నానిన తనకు బ్యాటరీ ట్రైసైకిల్ మంజూరు చేయాలని కోరుతూ జేసికి దరకాస్తు పెట్టారు, పాణ్యం మండంల భూపనపాడు గ్రామానికి చెందిన సత్యరాజు తన తండ్రికి త్రామ పొలిమేర సర్వే నెంబరు 136లో 2.35 ఎకరాలు మరియు సర్వేనెంబరు 155లో 2.35ఎకరాలు ఉందని తండ్రి మరణించిన పిదప తన తమ్ముడు ఎవరికి తెలిపకుండా తన పేరుమీద అన్‌లైన్‌లో మరియు పట్టాదారు పాసుపుస్తకాఉల చేయించుకున్నారని సంబందిత పొలాన్ని నా పేరుమీద కూడా అన్‌లైన్ చేయించడంతో పాటు పట్టాదారు పాసుపుస్తుకాలు మంజూరు చేయాలని కోరుతూ జేసికి మొరపెట్టారు.ఇంకా 124 దరకాస్తులు తమ సమస్యలను పరిస్కరి ంచాలని అర్జీలు పెట్టుకున్కానరు.

కరివేన గ్రామంలో.. ముమ్మరంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

- : రూ.2.20కోట్ల పనులు పర్యవేక్షణ
- : పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ సుబ్బయ్య
- : టిడిపి మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి
- : వైసిపి ఐదేళ్ల ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి శూన్యం
- : శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ సహకారంతో పల్లెపండుగ

ఆత్మకూరు,నవంబర్25,ప్రభాతవార్త:

వైసిపి ఐదేళ్ల పరిపాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యంగా మారి ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురైయ్యారని టిడిపి మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో పల్లె పండుగ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ సుబ్బయ్య ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా టిడిపి అధ్యక్షుడు మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో కరివేన గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు రూ.2.20కోట్లతో అభివృద్ధి పనులను ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు.

రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5నెలలోనే గ్రామాల అభివృద్ధి పనులు చేపట్టడం ఇదే మొదటి సారని అన్నారు. గ్రామాలలో ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించినందుకు ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డికి గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వీరి వెంటా టిడిపి గ్రామ నాయకులు కాగుల శేషన్న, బాలుడు, సొంపల్లి వెంకట్రావు, టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోగ పరిష్కరించాలి..!

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని,నవంబరు 25,ప్రభాతవార్త

ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగ పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం నందు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పిజిఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండ చూడాలన్నారు. అనంతరం ప్రజల నుండి వచ్చిన అర్జీలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రనివాసరాజు,వేణుసూర్య,డిఎల్‌డిపిఓ నూర్జహాన్,ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ,గృహ నిరా ్మణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఆర్‌అండ్‌బి డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభావం..!

- విద్యుత్ స్థంభం ఏర్పాటు చేసిన అధికారులు

పత్తికొండ,నవంబరు 25,ప్రభాతవార్త

గత రెండ్రోజుల క్రితం బాధితురాలు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ ఇంటి ముందు విద్యుత్ స్థంభం ఏర్పాటుపై విదు ్యత్ అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని విన్నవించగా అదే విషయం వార్త పత్రికలో శీర్షిక ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. ఇందుకు స్పందించిన అధికారులు సోమవారం పట్టణంలోని శ్రీరామ్‌పేట కాలనీలో విద్యుత్ అధికారులు విద్యుత్ స్థంబాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న వార్త పత్రికకు బాధితురాలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

26 న రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్. అండర్ -19 ఫెన్సింగ్ క్రీడలు

నంద్యాల హాస్పటల్,నవంబర్ 25,ప్రభాతవార్త:

ఈ నెల 26 నుండి 28 వరకు రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్. అండర్ -19 ఫెన్సింగ్ క్రీడలు పద్మావతిఇ నగర్‌లోని డి.ఎస్.ఏ.ఇండోర్ స్టేడి యం నందు నిర్వహించ బడుతాయని నంద్యాల జిల్లా విద్యాధికారి పి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు.రాష్ట్రస్థాయి క్రీడలు ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యయంలో నిర్వాహక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. అనంతరం ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతు 13 జిల్లాల నుండి దాదాపు 300 మంది క్రీడాకారులు కోచ్‌లు, మంది మేనేజర్లు, 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, టెక్నికల్ సిబ్బంది పాల్గొంటాని తెలిపారు. ఏపి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.పి. రెడిడ్డి, జిల్లా కార్యదర్వి నాగరాజు, ట్రెజరర్ భుజంగారావు,ఫిజికల్ డైరెక్టర్లు భరత్‌రెడ్డి, నాగరాజు, రాజేష్, ఓబులేషు, మహాబూబ్‌బాష, కవిత,రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో.. అంబేద్కర్ ఘననివాళి

బనగానపల్లె, నవంబర్25, ప్రభాతవార్త:

నేడు 75వ భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అవుకు మెట్ట వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరుగుతుందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్య క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, వైసీపీ అన్ని అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులందరూ మంగళవారం ఉదయం 9గంటలకు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

భక్తులతో కిక్కిరిసిన సంగమేశ్వరం

కొత్తపల్లి,నవంబర్ 25,ప్రభాతవార్త:

కార్తీక మాసం చివరి సోమ వారం కావడంతో భక్తులతో సంగమేశ్వరం కిక్కిరిసింది. ముందుగా ఆలయ పురో హితులు తెలకపల్లి రఘు రామశర్మ దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాల జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సప్త స్నానాలు ఆరించి కార్తీక దీపాలు నదిలో వదులుతు నదీమతల్లికి పూజలు చేశారు. అనంతరం సంగమేశ్వరుడుని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్కుకున్నారు. ఆలయంలో మహిళలు కోలాటం ఆడుతు సందడి చేశారు.

జల్సాలకు అలవాటుపడి.. అప్పులు చేసి..

- ఇద్దరు మట్కాబీటర్లు అరెస్ట్...
- రూ.2.15 లక్షల నగదు, సెల్‌ఫోన్, 10 లీటర్ల నాటుసారా స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీయస్పీ సోమన్న

ఆదోనిటౌన్, నవంబర్25, ప్రభాతార్త;

ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి గత 15 సంవత్సరాల నుంచి బళ్లారిలో ఉంటూ రిఫ్రిజిరేషన్ వర్క్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొన్ని సంవత్సరాల నుంచి జల్సాలకు అలవాటుపడి చాలాచోట్ల అప్పులు చేసి, చేసిన అప్పులు కట్టడానికి వీలు లేకపోవడంతో అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో మట్కా ఆట మత్తులో పడి కటకటాలపాలయ్యాడు. ఈ మేరకు సోమవారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు మట్కా నిర్వహిస్తున్న వారిని మీడియాకు చూపుతూ డీయస్పీ సోమన్న, త్రీటౌన్ సీఐ రామలింగయ్య వివరాలను వెల్లడించారు. ఆదోని పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న అలీహుసేన్, చాంద్‌బాషాలను శ్రీకాంత్‌రెడ్డి కలుసుకుని మాట్లాడుకున్నారు. వారి నుంచి శ్రీకాంత్‌రెడ్డి ప్రతిరోజూ మట్కా ఆట నుంచి డబ్బుల లావాదేవీలు చేస్తూ నాటుసారా వ్యాపారం కూడా చేసేవాడు. వారితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి లావాదేవీలను మట్కా ఆటల లెక్కలు, మిగతా విషయాలన్నీ చర్చించుకుని మట్కా నిర్వహిస్తుండేవాడని తెలిపారు. అయితే ఈనెల 1వ తేదీన మట్కా నిర్వహిస్తున్న అలీహుసేన్, ఈరప్పలను పట్టుకుని వారి నుంచి రూ.35 వేలు నగదు, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, వారిద్దరినీ రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. ఈ కేసులో భాగంగానే ఇంకొంతమంది ముద్దాయిల గురించి రాబడిన సమాచారం మేరకు శ్రీకాంత్‌రెడ్డి, చాంద్‌బాషా కోసం వెతుకుతుండగా పోలీసులు వెతుకుతున్నారనే విషయం తెలుసుకుని, లాయర్‌తో మాట్లాడుకోవాలని

గత కొన్ని రోజులుగా మట్కా ద్వారా సంపాదించిన డబ్బును తీసుకుని, సోమవారం బళ్లారి నుంచి ఆదోనికి వచ్చి, చాంద్‌బాషాతో ఆదోని కొండలో గుర్తు తెలియని వ్యక్తితో నాటుసారా కొనుగోలు చేసుకుని దానిని అమ్మి లాయర్‌తో కలిసి మాట్లాడాలని పట్టణశివారులోని ఆస్పరి బైపాస్ రోడ్డులో ఖాళీ స్థలంలో ఉండగా వారిపై త్రీటౌన్ పోలీసులు దాడులు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,15,600 నగదు, సెల్‌ఫోన్, పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు డీయస్పీ, సీఐ తెలియజేశారు.

అనారోగ్యంపై నడక..!

- రోగాల అంచున బతుకులు

మిడుతూరు, నవంబర్ 25, ప్రభాతవార్త :

శుభ్రత, పరిశుభ్రత.. చేతులు కాళ్లు కడుక్కోవాలి, వేడినీరు తాగాలి, మా ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ చేరే వస్తువులు లేకుండా జాగ్రత్త పడాలి.. ఇలా వైద్యులు, అధికారులు సమావేశాల్లో ప్రజలకు వివరిస్తారు, జాగ్రత్తలు సూచిస్తారు. కానీ అనారోగ్య మూలాలు కళ్లెదుట కనబడుతున్నా పట్టించుకోరు. చివరికి చాలా మంది వీధుల్లో రోగాల అంచున బతుకులు సాగదీస్తూ అనారోగ్యంపై నడక కొనసాగిస్తున్నారు. మండలంలోని అలగనూరు గ్రామంలోని ఎస్‌సి కాలనీలో నీళ్లట్యాంక్ పరిసర ప్రాంతాలతో పాటు వీధిలో మురుగునీరు నిల్వ చేరి అనారో గ్యాన్ని ఆహ్వానిస్తుంది. కనీసం అ రహదారిపై పాదచారులు నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి. ముఖ్యంగా నీళ్ల ట్యాంక్ వద్ద నిల్వ నీరు పోయే అవకాశం లేకపోవ డంతో రహదారిపై మురుగునీరు నిల్వ చేరి దోమలకు నిలయంగా మారింది. ఈ మురుగునీరు పేరుకుపోవడంతో టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారిన పడి ప్రాణాపాయస్థితికి చేరుకుంటామేమో అని స్థానికులు అందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈసమస్య పరిష్కరించాలని గ్రామ పరిధిలోని అధికారి దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారేగానీ, అది అచరణలో అమలు కావడంలే దని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఎంపిడిఓ దశరథరామయ్య, ఈఓఆర్‌డి సంజన్నలు స్పందించి సమస్య పరిష్కారానికై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

5700లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

- 40లీటర్ల నాటుసారా స్వాధీనం

బనగానపల్లె, నవంబర్25, ప్రభాతవార్త:

బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు మండలంలోని కొండమనాయనపల్లి, పిక్కలపల్లి తండా గ్రామాల అటవీ ప్రాంతాల్లో సోమవారం 5700లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు, 40లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి, ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి, నంద్యాల జిల్లా ఈస్‌టీఎఫ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణదాసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు కర్నూలు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హనుమంతరావు, నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు కొండమనాయనపల్లె, పిక్కలపల్లి తండా గ్రామాల అటవీ ప్రాంతాల్లో నాటుసారా స్థావరాల పై బనగానపల్లె ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్, రమేష్‌బాబు, కోవెలకుంట్ల ఎక్సైజ్ ఎస్ఐ ప్రవీణ్ వారి సిబ్బందితో కలిసి అవుకు మండలంలో విస్తృత దాడులు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంచేసిన నాలుగు బట్టీల్లో ఉన్న 5700లీటర్ల బెల్లంఊటను ధ్వంసంచేసి, 40లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని సారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. సారా తయారీదారులు తమ పద్ధతులు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

వెల్దుర్తిలో ఘనంగా.. కార్తీక దామోదర లక్షదీపోత్సవం

- మాజీ మంత్రి కెఇ ప్రభాకర్,ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు హాజరు..
- కార్తీకదీపాలతో కళకళలాడిన బాలుర ఉన్నతపాఠశాల ఆవరణం..

వెల్దుర్తి,నవంబర్25,ప్రభాతవార్త

కార్తీక దామోదర మాసాన్ని పురస్కరించుకొని ఇస్కాన్-అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం కర్నూలు వారి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వెల్దుర్తి జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో కార్తీక దామోదర లక్షదీపోత్స వం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి కెఇ ప్రభాకర్,పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు,కెఇ రుద్రఫణిగౌడ్‌లు హాజరు కాగా వారిని మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్, మాజీ జడ్పీటిసి యల్.ఇ.పుష్పావతిలు సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కెఇ ప్రభాకర్,పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇంత గొప్ప పుణ్యకార్యక్రమంలో తాము పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు.ఈ మహాకార్యానికై శ్రమించిన యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్‌ను వారు అభినందించారు.ప్రతి ఒక్కరు దైవచింతనలో జీవనం సాగించాలని చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.ముందుగా వి.యం. సురేష్ ఆర్కెస్ట్రా వెల్దుర్తి వారిచే భక్తిగీతాల ఆలాపన,సంధ్యహారతి,ఇస్కాన్ భక్తులచే హరినామ సంకీర్తన,పూజ్యశ్రీ రూపేశ్వర చైతన్యదాస్,మందిర ఉపాధ్యక్షులు, ఇస్కాన్ తిరుపతి వారిచే దామోదర లీల ప్రవచనము,దామోదర హారతి,కార్తీక దామోదర లక్షదీపోత్స వం నిర్వహించారు.మహిళభక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై కార్తీక దామోదర లక్షదీపోత్స వంలో పాల్గొని దీపాలు వెలిగించారు.దీంతో ఆ ప్రాంతమంతా కార్తీకదీపాలతో కళకళలాడింది.అనంతరం భక్తులందరికి అన్నదానం ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్, మాజీ జడ్పీటిసి యల్.ఇ.పుష్పావతి,ధ్యానకేంద్ర నిర్వాహకులు జి.శంకరయ్య, తెదేపా మండల నాయకులు ఎస్.బోయినపల్లి నర్సింగ్ కాంతారెడ్డి,పుల్లగుమ్మి నాగేశ్వరరెడ్డి,జి.రమణాచలం,సంపూర్ణ ఇండేన్‌గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ యల్.ఇ.రమేష్‌గౌడ్,వెల్దుర్తి సిహెచ్‌సి డాక్టర్.ఏ.సోమశంకర వరప్రసాద్, సిద్దనగట్టు వెంకటేశ్వర్లు,మల్లికార్జున,సుధాకర్‌గౌడ్,మండలంలోని వివిధ గ్రామాల నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. ప్రభుత్వం మీ కష్టాన్ని గుర్తించింది

: ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరుటౌన్, నవంబర్ 25, ప్రభాతవార్త :

అమ్మా.. మీ కష్టాన్ని ప్రభుత్వం గుర్తించింది, అనారోగ్యంతో బాధపడే మీకు ఆర్థికసాయం చేసి మీ కుటుంబానికి సీఎం చంద్రబాబునాయుడు అండగా నిలిచారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సీఎం రిలీఫ్ ఫండ్ పొందిన మహిళతో అన్నారు. పట్టణంలోని లింగం వీధిలో నివసించే కురుకుంద మాధవి ఇంటికి సోమవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన రూ.73,730ల చెక్కును కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు చేస్తూనే అభివృద్ధిని కూడా మరోవైపు పరుగులు పెట్టిస్తున్నాడని, ప్రజలకు అరోగ్యశ్రీ కింద పలు చికిత్సలు చేసినా, ఇంకా కొందరు ఎవరైనా తమకు వచ్చే అనారోగ్యాలకు చికిత్సలు చేయించుకోలేని పరిస్థితి ఉన్న వారికి ప్రత్యేకంగా సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్నారన్నారు. చాలా మందికి ఈ ముఖ్యమంత్రి సహాయనిధి మొత్తం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్‌లు జాకీర్‌బాష, మందడి వాణి, చిన్నరాజు, తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, రవీంద్రారెడ్డి, దేశెట్టి శ్రీనివాసులు, రజనీకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గా భోగేశ్వర క్షేత్రంలో అద్భుత ఘట్టం..!

- దుర్గా భోగేశ్వరుడిని తాకిన లేలేత సూర్యకిరణాలు

- అపురూప దృశ్యాన్ని చూసి పులకరించిన భక్తులు

గడివేముల, నవంబర్25, ప్రభాతవార్త;



గడివేముల మండలంలోని దక్షిణ కాశీగా పేరు పొందిన గడిగరేవుల గ్రామ సమీపంలోని శ్రీ దుర్గా భోగేశ్వర క్షేత్రంలో సోమవారం నాడు అద్భుత ఘట్టం ఆవిష్కృత మయ్యింది. సూర్య భగవానుడి లేలేత కిరణాలు దుర్గా భోగేశ్వర స్వామిని తాకాయి. లేలేత కిరణాల కాంతితో బంగారువర్ణంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ అపురూప దృశ్యాన్ని భక్తులు కనులారా చూసి పులకించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్‌శర్మ మాట్లాడుతూ ఈ వారం రోజులు బానుడి కిరణాలు దుర్గా భోగేశ్వరస్వామిని ప్రతిరోజూ తాకుతాయన్నారు. ఈ వారం రోజులు ఉదయం 6;55 గంటల నుంచి 7;05 గంటల వరకు భానుడి కిరణాలు స్వామివారిని తాకుతాయన్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించడానికి భక్తులు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేశారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. మహిళలు వేకువజామునే ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పంచమకోనేరులలో స్నానమాచరించి శ్రీ దుర్గా సమేత భోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భోగేశ్వర క్షేత్రంలోని దుర్గా అమ్మవారి ఆలయంలో అర్చకులు గిరిధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చన, పంచామృతాభిషేకం గావించారు. ఆర్యవైశ్య సంఘం అన్నసత్రం కాశిరెడ్డి నాయన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గడివేముల ఎస్ఐ సిసి నాగార్జునరెడ్డి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో ఎల్.రామానుజన్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణ పాల్గొన్నారు.

కడపటి సోమవారం భక్తజన కోటితో పోటెత్తిన యాగంటి క్షేత్రం

- భక్తుల సేవలో అన్నదాన సత్రాలు

- భక్తులతో కిటకిటలాడి శైవక్షేత్రాలు

బనగానపల్లె, నవంబర్25, ప్రభాతవార్త:

బనగానపల్లె మండలంలోని పలు శైవక్షేత్రాలు శివకేశవులకు అత ్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసోత్సవంలో వచ్చే కడపటి సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే భక్తులు బనగానపల్లె మండలంలోని ఎర్రమల కొండల్లో కొలువైన శ్రీ ఉమామహేశ్వరులను దర్శించుకు న్నారు. భక్తుల ఓం నమ:శివాయ నినాదాలతో, శివనామ స్మరణతో శైవక్షేత్రాలు, శివాలయాలు మారుమోగాయి. ప్రధానంగా ముక్కంటి విగ్రహ రూపన వెలసిన యాగంటి ఉమామహేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ఈవో బి.చంద్రుడు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలీ శ్వరరెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర నామావళితో ప్రత్యేక

పూజలను ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ, ముఖ్య అర్చకులు సత్యనారాయణ శర్మ, సహాయ అర ్చకులు రాఘవేంద్ర శర్మలు నిర్వహించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులు ముందుగా పెద్దకోనేరులో పుణ్యస్నానాలు చేసి పరమ శివుడిని దర్శించుకున్నారు. గాలి గోపురం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్